## ఎమ్మెల్సీ శంభీపూర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మేడ్చల్, మార్చి 13 : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బుధవారం ఆ పార్టీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్‌లో రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వైస్ ప్రెసిడెంట్ రఘుపతిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, సాయి పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాలు వాడితే కఠిన చర్యలు : సీఐ

జవహర్‌నగర్, మార్చి 13: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ర్యాలీలు, సమావేశాల్లో డ్రోన్ కెమెరాలు వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చ రించారు.

## వాహనాల తనిఖీ



కీసర, మార్చి 13; కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో పకడ్బందీగా వాహనాలను తనఖీ చేస్తున్నారు. కీసరగుట్ట స్వాగతద్వారం వద్ద కీసర పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. యాదాద్రి –భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నుంచి కీసర వైపు, ఇటు నుంచి అటు నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలను క్షణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బుధవారం కీసర ఎస్సై నాగరాజు పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టారు.

# ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉప్పల్, మార్చి 13 : నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని ధర్మపురికాలనీ, సాయిరాంనగర్ ప్రాంతాల్లో బుధవారం సీవరేజ్ పైపులైన్ పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం నిధులు తీసుకువచ్చి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామన్నారు. అభివృద్ధికి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు, నీటి సమస్యలు రాకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా వరద నియంత్రణ కోసం పనులను సత్వరమే పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, అధికారులు సంతోష్‌కుమార్, రజనీకాంత్‌రెడ్డి,సత్యనారాయణ, ఉపేందర్, నాయకులు పల్లె నర్సింగ్‌రావు, కొండల్‌రెడ్డి, నరేశ్, మోహన్, కే. రవీందర్, మహేందర్, రాజ్‌కుమార్, పాపిరెడ్డి, శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పూజలు

ఉప్పల్ భరత్‌నగర్‌లోని భూలక్ష్మిదేవి, లక్ష్మి గణపతి, శ్రీసుబ్రమణ్య ధ్వజస్తంభ, శిఖర, బలిపీఠ, గజవాహన, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాధవనాంద సరస్వతి స్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

### డ్రైనేజీ సమస్యలు తలేత్తకుండా చర్యలు : ఎమ్మెల్యే బండారి

మల్లాపూర్, చర్లపల్లి : నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట హెచ్‌బీకాలనీ డివిజన్ ఇందిరానగర్‌లో సుమారు రూ. 32లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు వేణుగోపాల్, దుర్గారెడ్డి, నారంరెడ్డి, ప్రభుల్, విట్టలయ్యగౌడ్, సత్యనారాయణ, పెంటయ్య, కృష్ణమూర్తి, మల్లేశ్‌గౌడ్, జంపాల్‌రెడ్డి, బాల్‌రాజు, రామకృష్ణ, చంద్రమౌళి, రాజనర్సు, శివకుమార్, నర్సింహ, సాయికుమార్, రమేశ్, నవీన్‌గౌడ్, కుమార్, శశిరాజు, సంజీవ, శివాజీ, శేఖర్‌గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్



ఇందిరానగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

## ఉద్దెమర్రిలో మొల్ల జయంతి



మొల్ల జయంతిలో పాల్గొన్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుదర్శన్, శాలివాహన కుమ్మర సంఘం నాయకులు

శామీర్‌పేట, మార్చి 13 : మూడుచింతపల్లి మండలం ఉద్దెమర్రిలో బుధవారం శాలివాహన కుమ్మర సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రచయిత్రి మొల్లమాంబ 584వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, సభ్యులు మొల్లమాంబ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అన్నారు. మహిళలకు ఆమె ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శామీర్‌పేట మండలాధ్యక్షుడు విలాసాగరం సుదర్శన్, మూడుచింతపల్లి బీసీసెల్ అధ్యక్షుడు నెల్లుట్ల యాదగిరి, కుమ్మర సం ఘం అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు రామాంజనేయులు, కరుణాకర్, శివశంకర్, యాదయ్య,భాగయ్య, బాలయ్య, మల్లేశ్, ఆంజనేయులు, శ్రీరాములు, రవీందర్, సందానందం, ప్రవీణ్, కిరణ్, ఆంజనేయులు, ఉపేందర్, బలరాం, భాస్కర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ అంచనా బడ్జెట్ రూ. 17.84 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్, మార్చి 13: పచ్చదనానికి పెద్దపీట వేసి అభివృద్ధికి బాటలు వేస్తామని జవహర్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశంలో 2024–25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ. 17.84 కోట్లకు సభ్యులు అమోదం తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్పొరేషన్ అన్ని రకాల మౌలిక వసతులకు ప్రాధాన్యం కల్పించి జవహర్‌నగర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. డిప్యూటీ మేయర్ అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తాజ్‌మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు, డీఈఈ మాధవచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీఎస్ స్రవంతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



నాగారం 9వ వార్డులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 13 : సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు విష్ణుపురి కాలనీలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణతో కాలనీల్లో కొత్త వారి కదలికలను గమనించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేశయాదవ్, కౌన్సిలర్లు అనిత, రేణుక, లావణ్య, దయాకర్‌రావు, శ్రీనివాస్, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,ఎస్ఐ నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు తేళ్ల శ్రీదర్, నిమ్మల శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, నందకిశోర్, వీరేశంగుప్తా, కృష్ణమాచార్యులు, శంకర్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు



ఉప్పల్, మార్చి 13 : ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహర్దశ తెస్తామని ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి అన్నారు. పాఠశాల భవనం, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ. 2 కోట్ల నిధులు మంజూరు పత్రాన్ని కార్పొరేటర్ బుధవారం ప్రధానోపాధ్యాయుడికి అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి నిధులను అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, ఎలిజబెత్, అజిజ్, శ్రీనయ్య, నేతలు లక్ష్మణ్, రఘుపతిరెడ్డి, జగన్నాథ్, రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, ఆగంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



మల్కాజిగిరి డివిజన్ ఆర్‌కే నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి, మార్చి 13: రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కాంట్రాక్టర్‌కు, సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఆర్‌కే నగర్‌లో రూ. 28 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ దీపక్, గణేశ్, మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, రంగారావు, మహేందర్, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్వాసన వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలి



రాంకీ సంస్థ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

జవహర్‌నగర్, మార్చి 13: జవహర్‌నగర్‌లోని చెత్త డంపింగ్ పరిసరాల్లో దుర్వాసన వెదజల్లకుండా రాంకీ సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సూచించారు. బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని చెత్త డంపింగ్ యార్డ్‌ను అదనపు కలెక్టర్ సందర్శించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డంపింగ్ నుంచి విడుదలయ్యే రసాయనాలను కాలనీలోకి వదలొద్దన్నారు. చుట్టూ నివాస ప్రాంతాల వారికి మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ సీనియర్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ చెత్త డంపింగ్ ప్రాంతాల చుట్టూ క్రమం తప్పకుండా స్ప్రే చేస్తున్నామని, రసాయన నీటిని లిచెట్ ట్రీట్‌మెంట్‌తో మంచినీటిగా మారుస్తున్నామన్నారు. కొత్త టెక్నాలిజీతో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, తాసీల్దార్ సుచరిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ఘట్‌కేసర్, మార్చి 13 : పోచారం మున్సిపాలిటీ 3వ వార్డు యంనంపేట్ వీకర్ సెక్షన్ కాలనీలో గురువారం ఉదయం 10 గంటలకు కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించనున్నట్లు చైర్మన్ బి.కొండల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ. 35 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. 11 గంటలకు పోచారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నయంపై దుకాణాల యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ వివరించారు.

## ప్రతి కాలనీలో సీసీ, బీటీ రోడ్లు పూర్తి చేస్తాం



నాగారం 20వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్ సుమిత్ర

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 13 : ప్రతి కాలనీలో సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో రూ. 20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టామని, భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశయాదవ్, కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్ర,మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూపాల్ రెడ్డి, నాయకులు సురేశ్, రామారావు, రాథోడ్, నరేందర్‌రెడ్డి, విమల, భాగ్యలక్ష్మి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల పనివేళలు మార్చాలి

ఎల్బీనగర్, మార్చి 13 : ఎండాకాలం నేపథ్యంలో పారిశుధ్య కార్మికులకు వడదెబ్బ తగులకుండా పనివేళలను మార్చాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం సీఐటీయూ నాయకులు హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో పాటుగా ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల ఉప కమిషనర్లకు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్ఎంసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అలేటి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పారిశుధ్య కార్మికులతో కలిసి అధికారులకు విన్నవించారు. వారు మాట్లాడుతూ.. పదిరోజులుగా ఉష్ణోగ్రతలు 36 సెంటీగ్రేడ్‌కుపైనే ఉంటున్నాయని, అందుకోసం కార్మికులకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు సమయాలను పనివేళలుగా మార్చాలని కోరారు.

## నల్సార్‌లో రక్తదాన శిబిరం



శామీర్‌పేట, మార్చి 13 : పీవీ నర్సింహారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 80మంది విద్యార్థులు, ఆచార్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పీవీ నర్సింహారావు ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తలసీమియాతో బాధపడుతున్న వారికి రక్తాన్ని అందిస్తున్నామన్నారు. మూడేళ్లుగా నల్సార్ విద్యార్థులు కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహణకు సహకరిస్తున్నారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## వంద శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యం..

బోడుప్పల్, మార్చి 13 : వంద శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా కృషి చేస్తున్నామని బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ రామలింగం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సమీక్షా సమావేశంలో ఆస్తి పన్ను వసూలుపై ఆయన చర్చించారు. పన్ను వసూలులో నిర్లక్ష్యం వహించే బిల్ కలెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 31లోపు పన్ను చెల్లించని గృహ, వాణిజ్య సముదాయాలకు మున్సిపల్ చట్టం ప్రకారం మౌలిక వసతులను నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు.

## మున్సిపాలిటీ కమిటీ అనుమతితోనే కాంగ్రెస్ పార్టీలో చేరాలి

ఘట్‌కేసర్, మార్చి 13 : పోచారం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్న ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు తమను సంప్రదించాలని ఆ పార్టీ పోచారం మున్సిపాలిటీ కమిటీ నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితర నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇతర పార్టీల నాయకులు ఇష్టానుసారంగా మున్సిపాలిటీ కమిటీకి తెలియకుండానే పెద్ద నాయకుల వద్దకు వెళ్లి పార్టీలో చేరుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపాలిటీ కమిటీతో సంప్రదించిన తరువాతే పార్టీలో చేరాలని సూచించారు.

# మల్కాజిగిరి అభివృద్ధికి.. ప్రభుత్వంతో పోరాడుతా!

- అధిక నిధుల మంజూరే లక్ష్యం
- అధికారులు నియోజకవర్గ పురోగతికి సహకరించాలి
- కార్పొరేటర్లు, కార్యకర్తలకు అండగా నిలబడుతా..
- వంద రోజుల పాలనపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇంటర్వ్యూ..



*మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల మంజూరీ కోసం వివిధ శాఖల మంత్రులు, అధికారులను కలిసి విన్నవిస్తా.. అవసరమైతే ప్రభుత్వంతో పోరాడుతా. విద్య, వైద్య రంగాలతోపాటు సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పన, చెరువుల అభివృద్ధి, తాగునీరు, రోడ్లు, ఆర్‌యూబీ తదితర సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తా. స్థానిక అధికారులు బేషజాలకు పోకుండా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ పురోగతికి సహకరించాలి.*

నేరేడ్‌మెట్, మార్చి 13 : 'రాజకీయాలకతీతంగా మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా.. మల్కాజిగిరి, అల్వాల్ మున్సిపాలిటీల పరిధిలోని తొమ్మిది డివిజన్లలో మౌలిక వసతుల కల్పనతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలిచి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మర్రి రాజశేఖరరెడ్డిని బుధవారం 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి పలుకరించారు. ఈ సందర్భంగా ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ .

**ప్రశ్న : చెరువుల అభివృద్ధి అసంతృప్తిగా మిగిలిపోయింది. వీటికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు : చెరువుల అభివృద్ధికి ఇరిగేషన్ తోపాటు ఇతర అధికారులతో ఇప్పటికే మట్లాడాను. ఆర్‌కే పురం చెరువు డిజైన్‌లో కొన్ని లోపాలు ఉన్నట్టు గుర్తించాము. వాటిని సరి చేయాలని అధికారులకు సూచించా. చుట్టుపక్కల కాలనీల నుంచి వర్షపు నీరు చెరువులోకి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించాను. గుర్రపు డెక్క, మురుగునీరు చేరకుండా, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాను.

**ప్రశ్న : వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ సమస్య ఎంత వరకు వచ్చింది? ఆర్‌కే పురం వంతెన సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?**

జవాబు : వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ సమస్య పరిష్కారానికి రైల్వే అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశాను. ఆర్‌యూబీ డిజైన్‌లో మార్పులు, చేర్పులను అధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నది. ఆర్‌కే పురం వంతెన వెడల్పు పనులపై కూడా సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నాను.

**ప్రశ్న : నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు : స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద రూ.10 కోట్ల నిధుల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాను. ఈ నిధులు మంజూరైతే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.కోటి, ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కళాశాలలకు రూ. 2 కోట్లు, అసంతృప్తిగా మిగిలిన రోడ్లు, డ్రైనేజీతో పాటు కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు సుమారు రూ. 6.50 కోట్ల నిధులను కేటాయిస్తాను.

**ప్రశ్న : కౌకూర్‌లోని రాజీవ్ గృహకల్ప ఇండ్లకు నీటి సదుపాయం లేదు. సమస్య పరిష్కారానికి చొరువ చూపుతారా?**

జవాబు : కౌకూర్‌లోని ఆర్‌జీకే ఇండ్ల లబ్ధిదారులది విచిత్ర పరిస్థితి. 15 ఏండ్లుగా నల్లా కనెక్షన్ లేకపోవడం బాధకారం. మరి అధికారులు ఎందుకు దృష్టి పెట్టలేదో తెలియదు. తప్పకుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. అవసరమైన నిధులు కేటాయిస్తాను.


**ప్రశ్న : ఎమ్మెల్యేగా వందల రోజుల పాలన ఎలా ఉన్నది?**

జవాబు : ఎమ్మెల్యేగా వంద రోజుల పాలన చాలా సంతృప్తినిచ్చింది. బీఆర్ఎస్ శ్రేణుల్లో మనోనిబ్బరం కల్పించాను. గత మూడు నెలల్లో ఎన్నో సమస్యలపై పోరాడాను. ప్రజల ఇబ్బందులను తెలుసుకుని ఆయా అంశాలపై సంబంధిత అధికారులతో మట్లాడి పరిష్కారానికి కృషి చేశాను. వంద రోజులుగా పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు నా వెన్నంటే ఉంటూ పూర్తి సహకారం అందించడం ఆనందంగా ఉన్నది. ప్రభుత్వం మారినా పార్టీ నాయకులు మరింత సమరోత్సావంతో పని చేస్తున్నారు. రాబోవు రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. త్వరలోనే మల్కాజిగిరిలో క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాను.

## 'లోక్‌సభ సీట్లు కేటాయించాలి'

ఖైరతాబాద్, మార్చి 13 : రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు లోక్‌సభ ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయించాలని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెదక్ లోక్‌సభ స్థానాన్ని నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర కోకన్వీనర్ జగన్ ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ నాయకుడు సంతోష్ పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో బీజేపీ నేత కె.లక్ష్మణ్ పర్యటన



ఘట్‌కేసర్ ప్రభుత్వ దవఖానలో గెయిల్ అందజేసిన పరికరాల గదిని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్

ఘట్‌కేసర్, మార్చి 13 : ఘట్‌కేసర్ పట్టణంలో బుధవారం రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పర్యటించారు. గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ. 75 లక్షలతో సమకూర్చిన పరికరాలను కే. లక్ష్మణ్ ఘట్‌కేసర్ ప్రభుత్వ దవఖానలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. అనంతరం గురుకుల కళాశాల ప్రాం తాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ నుంచి బాలాజీనగర్ వెళ్లేందుకు పుట్‌ఓవర్ వంతెనను ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ నుంచి వెళ్లే ఎంఎంటీఎస్ రైలును లింగంపల్లి వరకు నడిపించాలని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఎంపీ వెంట ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రైతు సొసైటీ చైర్మన్ ఎస్.రాంరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామికి పూజలు



కీసర మండలం పరిధిలోని చీర్యాల్ లక్ష్మీనర్సింహస్వామి వారిని బుధవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ వారికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి, ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలోని స్వామివారికి స్వర్ణ పుష్పాలతో నవీన్ మిట్టల్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ చైర్మన్ శాలువాతో ఘనంగా సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు.

*– కీసర, మార్చి 13*

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్

బోడుప్పల్, మార్చి 13: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నదని మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. నగర పరిధిలోని 10వ డివిజన్ వెస్ట్ బాలాజీహిల్స్ రూ. 21 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, స్థానిక కార్పొరేటర్ బొమ్మక్ సుగుణబాలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, నాయకులు బొమ్మక్‌బాలయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.